క్లుప్తంగా

కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించండి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి చిక్కడపల్లి స్ట్రీట్ నెంబర్ 10 వీరస్వామి గల్లిలో కొన్ని రోజులుగా తాగునీటిలో మురుగు నీరు కలుస్తున్నా జల మండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం బస్తీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పార్థసారథి, డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్‌కుమార్, జైపాల్‌రెడ్డి, భాగ్య, జ్యోతి, ఇందిర, గోపాలకృష్ణ, పద్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత



కాచిగూడ: మున్నూరుకాపుల్లో పేదింటి ఆడపిల్లల పెళ్లికి పుస్తె, మెట్టెలు, పట్టుచీర అందజేస్తున్నట్లు రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో కందికల్ గేట్ ప్రాంతానికి చెందిన సంకూరి శివకుమార్ కుమార్తె స్వాతి పెళ్లి నిమిత్తం పుస్తె, మెట్టెలు, పట్టుచీర అందజేశారు. కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు కేఎం వేణుగోపాల్, దండు నరేందర్, బాదే పద్మారావు, చేపూరి వెంకటేశ్వర్‌రావు, ఆకుల శ్రీరాజ్, సతీష్‌కుమార్, అన్నపూర్ణ, చెలిమెల ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 6న చలో ఢిల్లీ



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టన్ను చెరుకు పంటకు రూ.5 వేల ధర నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 6న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత చెరుకు రైతుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డి.రవీంద్రన్ పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు చెరుకు ధర నిర్ణయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 10.25 శాతం రికవరీ కోసం టన్ను చెరుకుకు రూ.3,050, 9.5 శాతం రికవరీకి టన్నుకు రూ.2,821 ప్రకటించిందన్నారు. కేవలం రూ.150 పెంచడం సరికాదన్నారు. డీజిల్, యంత్రాలు, ఎరువుల ధరలు పెరుగుతుండడంతో ఉత్పత్తి ఖర్చు పెద్ద ఎత్తున పెరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్, సహాయ కార్యదర్శి శోభన్‌నాయక్, సారంపల్లి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చిత్ర ప్రదర్శన



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న రామచంద్ర ఆర్ షరీకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ చిత్రకారుడు అరవింద్ ఏ కాంబ్లే గీసిన పలు చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శనకు సంబంధించిన సోలో ఎగ్జిబిషన్ పెయింటింగ్‌ను ప్రముఖ చిత్రకారుడు రామచంద్ర ఆర్ షరీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్రకారులను గుర్తించి ప్రోత్సాహం అందించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



యాదయ్య

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా తిప్పర్తి యాదయ్య గురువారం అబిడ్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఎంసీగా పని చేసిన హరికిషన్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కార్మిక విభాగానికి బదిలీ అయ్యారు. జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న యాదయ్యను ముషీరాబాద్ డీఎంసీగా నియమించారు. ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ సర్కిల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేస్తానన్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, ప్రజల సహకారంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తానన్నారు.

'ఆవ పంటలో జన్యుమార్పిడి సరికాదు'



సదస్సులో మాట్లాడుతున్న ప్రొ.సోమ మర్ల

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆహార పంటల్లో జన్యుమార్పిడి విధానాన్ని నిషేధించాలని ప్రముఖ శాస్త్రవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ సోమ మర్ల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జన్యుమార్పిడికి సంబంధించిన పంటలను ఆపకపోతే ప్రజల ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతుందన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో సురక్షిత ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమ మర్ల మాట్లాడుతూ.. జన్యుమార్పిడికి సంబంధించి ఆవ పంటకు ఇచ్చిన అనుమతిని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. సురక్షిత ఆహారం ప్రజల హక్కు అని, ఆహార పంటల్లో ఈ విధానాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. 2010 ఫిబ్రవరి 9న అప్పటి కేంద్ర మంత్రి జైరామ్ రమేష్ బీటీ వంకాయను నిషేధించినట్లు గుర్తు చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. ఆవ పంటలో జన్యుమార్పిడికి ప్రయత్నించడం సరికాదన్నారు. రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి విసా కిరణ్ మాట్లాడుతూ.. ఆవ పంట విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కార్యక్రమంలో బి.ఎస్.రెడ్డి, రైతు సంఘం నాయకులు పద్మ, టి.సాగర్, బి.కొండల్, ప్రొఫెసర్ ఆదినారాయణ, ప్రొఫెసర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

'గౌడ ఆత్మగౌరవ భవనాన్ని వెంటనే నిర్మించాలి'



సమావేశంలో పాల్గొన్న నర్సాగౌడ్, సిద్ధిరాములుగౌడ్ తదితరులు

కాచిగూడ: గౌడ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములుగౌడ్ డిమాండ్ చేశారు. మోకుదెబ్బ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొలు రైతుల కుటుంబాలకు కోటి రూపాయలు దానం చేసి అండగా నిలిచిన చక్రధరిగౌడ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాలుగు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్థులకు ఆత్మ గౌరవ భవనం పేరిట రూ.5కోట్లు, 5 ఎకరాల స్థలం కేటాయించి ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తొలగించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోకుదెబ్బ ప్రతినిధులు బాలేశంగౌడ్, ముత్యం నిర్సింహులుగౌడ్, బాలసాని సురేష్‌గౌడ్, అనంతుల రమేష్‌గౌడ్, రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, కదిరె ఆంజనేయులుగౌడ్, పి.మధుగౌడ్, ఎం.సంజీవ్, వెంకటేష్, కిషన్ పాల్గొన్నారు.

'బీసీల బడ్జెట్ కేటాయింపులను పునఃసమీక్షించాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న మహాసభ ప్రతినిధులు

కాచిగూడ: బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన బడ్జెట్‌ను పునఃసమీక్షించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.12వేల కోట్లు ఇవ్వాలన్నారు. గురువారం కాచిగూడలో బీసీ మహాసభ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌పటేల్‌గౌడ్ మాట్లాడుతూ.. జనాభాలో 54శాతం ఉన్న బీసీలకు బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.2వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.6,229 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో సగం వరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకే సరిపోతాయని, సంక్షేమ హాస్టళ్లు, బీసీ గురుకులాలకు సొంత భవనాలను ఏలా నిర్మిస్తారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ మహాసభ నేతలు ప్రశాంత్ నిమ్‌కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, ధీరేంద్రయాదవ్, తుంగబాబు, అలీం, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు

కాచిగూడ: మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అసెంబ్లీలో మున్నూరుకాపుల సమస్యలపై ప్రస్తావించి అండగా నిలవడం పట్ల మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం నారాయణగూడలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవయ్య మాట్లాడుతూ.. మున్నూరుకాపు కార్పొరేషన్, జిల్లాల్లో మున్నూరుకాపు హాస్టల్స్ విషయమై శ్రీధర్‌బాబు మాట్లాడారన్నారు.



మాట్లాడుతున్న దేవయ్య

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నేతలు ఆకుల నర్సింగ్‌రావు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య అభినందనీయం

నల్లకుంట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తుండడం అభినందనీయమని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ డాక్టర్ లయన్ బాబు మిరియం అన్నారు. గురువారం ఎల్‌బీనగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌ను బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీని కలిసి మాట్లాడారు. డొనేషన్లు తీసుకోకుండా లిటిల్ ఫ్లవర్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను చేర్చుకుని నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమని కొనియాడారు.



స్కూల్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న బాబు మిరియం, ఐజాక్‌రాజ్

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఏఈ అబ్దుల్ సలాంతో కలిసి గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని బాపునగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజల కోరిక మేరకు బస్తీలో సీసీ రోడ్డు, షాబాద్ బండలు వేస్తామన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, మారిశెట్టి నర్సింగ్‌రావు, గడ్డమీది శ్రీనివాస్, కృష్ణ, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు న్యాయం చేయాలి

కవాడిగూడ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గౌడ కులస్థుల సంక్షేమం ఏర్పాటు చేసిన గౌడ కార్పొరేషన్‌ను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పూర్తిగా నిర్వీర్యం చేశారని రాష్ట్ర గీత మోర్చా కో కన్వీనర్ బంటారం యాదగిరిగౌడ్ ఆరోపించారు. గౌడ కార్పొరేషన్ లేకపోవడం వల్ల చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి చనిపోయిన, గాయాలపాలైన గీత కార్మికులకు న్యాయం జరగడం లేదన్నారు. కార్పొరేషన్ ఉన్నప్పుడు దాని ద్వారా ఆర్థిక సహాయం అందేదన్నారు. గురువారం కవాడిగూడ తాళ్లబస్తీలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గౌడ కులస్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చనిపోయిన, గాయపడిన గీత కార్మికులకు న్యాయం జరగాలంటే రోజుల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా చర్యలు తీసుకుంటూ గౌడలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు మద్దెల చంద్రయ్యగౌడ్, పబ్బతి ప్రసాద్‌గౌడ్, కె.జ్ఞానేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కె.వి.రమణాచారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అంతర్జాతీయ తెలుగు సంఘం, పాస్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె.ధర్మారావు, ఉపాధ్యక్షుడు మంత్రి భుజంగరావు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు భాషా సంస్కృతి, సాహిత్య కళలు, ధార్మిక రంగాల అభివృద్ధికి రమణాచారి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, డాక్టర్ పి.కమలప్రసాదరావు, రేలంగి నరసింహారావు, కలవెండి కేఎస్ మూర్తి, పి.యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐజాక్‌రాజ్‌కు కోవిడ్ వారియర్ అవార్డు

నల్లకుంట: కోవిడ్ విపత్కర సమయంలో అన్నదానం, దుస్తుల పంపిణీ, మాస్కుల పంపిణీతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గాను బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్‌ను ద లీడర్స్ పేజ్ సంస్థ 'కోవిడ్ వారియర్-19' అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ రాపోలు రమ్య గురువారం ఐజాక్‌రాజ్‌కు అవార్డుపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐజాక్‌రాజ్ మాట్లాడుతూ.. ఈ అవార్డు తనలో మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగించండి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని త్యాగరాయ గానసభ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఫుట్‌పాత్‌పై టీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు. జవహర్‌నగర్, అశోక్‌నగర్, చిక్కడపల్లి, వివేక్‌నగర్ తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉందని స్థానికులు చెబుతున్నారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో తప్పిదాలపై విచారణకు డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ పరీక్షలు, ఫలితాలు, అర్హత మార్కులు తదితర అంశాల్లో జరిగిన తప్పిదాలపై రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు విచారణ చేపట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు గురువారం డిమాండ్ చేశారు. యూజీసీ మార్గ దర్శకాలను తుంగలో తొక్కి 50 శాతం రీసెర్చ్ మెథడాలజీ సబ్జెక్టుపై ప్రశ్నలు లేకుండా ఓయూ ప్రవేశ పరీక్షలను తప్పుగా నిర్వహించి విద్యార్థులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తప్పిదాలపై విచారణ చేసి రీసెర్చ్ మెథడాలజీకి 35 వెయిటేజీ మార్కులు ఇవ్వాలన్నారు. రాజ్యాంగ విలువలను పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీల రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ఆధారంగా కటాఫ్ మార్కులు లేకుండా అందరినీ ఇంటర్వ్యూలకు పిలవాలన్నారు.

ఓసీ కులాల సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న ఓసీ సామాజిక సంఘాల ప్రతినిధులు

కవాడిగూడ: రాష్ట్రంలో ఓసీ సామాజిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినట్లు ఓసీ సామాజిక సంఘాల సమైక్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సమయంలో ఓసీ సామాజిక సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రులు కేటీఆర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ.. ఓసీ సామాజిక వర్గాల్లోని పేదల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రామిరెడ్డి, జైపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

అంబర్‌పేట: సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ విభాగాల అధికారులతో కలిసి గోల్నాక డివిజన్‌లోని గోవింద్‌నగర్, అశోక్‌నగర్, లంక బస్తీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. పారిశుద్ధ్యం, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, రోడ్ల సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



గోవింద్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని ధర్నా





ధర్నా కార్యక్రమంలో అభివాదం చేస్తున్న పోరాట వేదిక నేతలు ,ధర్నాకు హాజరైన మహిళలు

కవాడిగూడ: నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు కేటాయించాలని, ఇల్లు అందని వారికి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై తీర్మానం చేయాలన్నారు. పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 87 కేంద్రాల్లో 28 వేల మంది గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వీరితో పాటు 11 వేల ఎకరాల్లో భూమి సాగు చేసుకుంటున్న వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాడ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నేతలు ఎస్.రమ, జె.వెంకటేష్, భూపాల్, వివిధ సంఘాల నాయకులు నాగయ్య, పోతినేని సుదర్శన్, ఆశాలత, ఎం.దశరథ్, శ్రీరాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఓయూలో సభలు, సమావేశాల నిషేధం అన్యాయం'



మాట్లాడుతున్న వెంకటేష్‌మాదిగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రొఫెసర్ కాశీం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శాంతియుతంగా చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేయడం దురదృష్టకరమని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి(టీఎంపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్‌మాదిగ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా విద్యా వ్యవస్థను ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా విద్యార్థులు పోరాటం ఉధృతం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నారని, నేడు ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో సభలు, సమావేశాలను నిషేధించడం అన్యాయమన్నారు. ప్రొఫెసర్ కాశీంపై కేసులు ఎత్తివేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఇంజం సాంబయ్య, రాష్ట్ర మీడియా అధ్యక్షుడు మాదిరి నర్సింగరావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కేశపాక నర్సింగ్, ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రైలు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెయింటర్ మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల మేరకు.. ఓయూ మాణికేశ్వరినగర్‌కు చెందిన పెయింటర్ స్వామి (48) గత నెల 2వ తేదీన జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి (36) అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపారు.

బ్యాగ్ చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లో నివాసముండే విశ్రాంత ఎక్సైజ్ ఎస్ఐ యాదగిరి ఈ నెల 6న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతి నుంచి నగరానికి వస్తుండగా ఆయన బ్యాగ్ చోరీకి గురైంది. తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద రూ.20వేల నగదు, ఏటీఎం కార్డు, సెల్‌ఫోన్ ఉన్న బ్యాగు చోరీకి గురైందని గురువారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం తిరుపతి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

అధిక మోతాదు యాంటీ బయోటిక్స్‌తో అనర్థం

గాంధీఆస్పత్రి: అధిక మోతాదులో యాంటీ బయోటిక్స్ మందుల వాడకంతో పలు రకాల రుగ్మతలకు గురయ్యే అవకాశం ఉందని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. గాంధీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం జరిగిన హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కమిటీ(హెచ్ఐసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక మోతాదు యాంటీ బయోటిక్స్ వాడకంతో సైడ్ ఎఫెక్ట్స్‌తో పాటు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హాస్పిటల్ యాంటీ బయోటిక్స్ మేనేజ్‌మెంట్ పాలసీని వైద్యులంతా తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది ఆపరేషన్ థియేటర్ల బయట స్క్రబ్ సూట్లు వేసుకుని తిరగడాన్ని నిషేధించినట్లు సూపరింటెండెంట్ రాజారావు స్పష్టం చేశారు. అనంతరం బయోమెడికల్ వ్యర్థాలు వేరు చేయడం, హెపటైటిస్-బీ వ్యాక్సినేషన్, అన్‌క్లియర్ ఏరియాస్, సిబ్బంది పనితీరు, కార్డియోథొరాసిస్, ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్లలో హెల్త్‌కేర్ వర్కర్స్‌కు ఎమ్మార్ఎస్ఏ స్క్రీనింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఇన్ఫెక్షన్ల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గాంధీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయాలజీ విభాగాలు సంయుక్తంగా రూపొందించిన హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ మార్గదర్శకాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, ఆర్ఎంఓ-1 జయకృష్ణతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఆర్ఎంఓలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.